www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 2 జులై 2025

5

చిత్తూరు




కూలిన ప్రహరీ గోడ

చిరువ్యాపారులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పుత్తూరు రోడ్డులో ఉన్న షర్మన్ స్కూల్ ప్రహరీ గోడ మంగళవారం సాయంత్రం కూలిపోవడంతో గోడపక్కన ఉన్న వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులకు స్వల్పంగా గాయాలయ్యాయి. మున్సిపల్ నగర కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని షర్మన్ పాఠశాల గోడ కూలిపోయే స్థితిలో ఉండడంతో దాదాపు 300 అడుగులు ప్రహరీ గోడ కూల్చివేశారు. గాయపడిన చిరు వ్యాపారస్తులను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



నేడు కుప్పంలో ముఖ్యమంత్రి పర్యటన



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈనెల 2వ తేదీన కుప్పంకు విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా 2వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు శాంతిపురం మండలం తుమ్మిసిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, అనంతరం 12.50 గంటలకు తుమ్మిసిలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణం చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభ వేదిక వద్ద పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాల అనంతరం ఎంఓయూలు కుదుర్చుకోవడం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్‌లు పరిశీలిస్తారన్నారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం 4.30 గంటలకు శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి చేరుకొని ఇంటింటికి పర్యటించనున్నారని తెలిపారు. తదుపరి సాయంత్రం 7.05 గంటలకు ముఖ్యమంత్రి నివాసం చేరుకును రాత్రి బస చేస్తారన్నారు. కార్యక్రమంలో రెండవ రోజైన 3న గురువారం ఉదయం 10.30 గంటలకు కుప్పం ఏరియా హాస్పిటల్ చేరుకొని టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించనున్నారని, అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు ముఖ్యమంత్రి స్వగృహం చేరుకొని అధికారిక సమీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమాలను ముగించుకొని సాయంత్రం 4.10 గంటలకు తుమ్మిసి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని బెంగళూరు తిరుగు ప్రయాణం అవుతారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

సిఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 2,3 తేదీలలో కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని, వారి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరబాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం కడ పీడీ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్ల పై జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు, జేసి జి. విద్యాధరితో కలసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఎక్కడ కూడా ఎలాంటి తప్పులు జరగకుండా సంబంధిత అధికారులు విధులు సక్రంగా నిర్వహించాలని తెలిపారు. బహిరంగ సభకు వచ్చిన ప్రజలకు తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్, బహిరంగ సభ, కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఇంటింటి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. 2న బహిరంగ సభలో కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి పంపిణీ చేస్తారని అలాగే వివిధ పథకాల కోసం బ్యాంకులు మంజూరు చేసిన సబ్సిడీ రుణాలకు సబంధించిన చెక్కులు లబ్ధిదారులకు అందిస్తారని తెలిపారు. ఏస్ ఇండస్ట్రీస్, ఈ రాయిస్, ఎస్వీఎఫ్ సోయా బీన్స్ అనే కంపెనీలతో కడా తరపున ఎంవోయూలు కుదుర్చుకుంటారని వీటిలో ఏస్ ఇండస్ట్రీస్ అనేది పాల ద్వారా మెడిసన్‌కు సంబంధించిన ఉత్పత్తుల కంపెనీ అని, ఎస్వీఎఫ్ సోయా బీన్స్ అనేది సోయా గింజల ద్వారా ఆహార ఉత్పత్తుల కంపెనీ అని, ఇక ఈ రాయిస్ కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కంపెనీ అని తెలిపారు. ఈ కంపెనీ ద్వారా 10 ఎలక్ట్రిక్ ఆటోలను ముఖ్యమంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, సబ్సిడీ మీద అందిస్తున్న ఎలక్ట్రిక్ సైకిళ్లు పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న హెలిప్యాడ్, తుమ్మిసి ఏపి మోడల్ స్కూల్, తదితర ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంటింటి సర్వేలో మంచి ఫ్లడ్ లైట్స్, పటిష్టమైన భారీ కేడ్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

వినాయకుని సేవలో టిటిడి జేఈవో



ప్రజాశక్తి- ఐరాల: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో వెంకయ్య చౌదరి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఈవో సాగర్ బాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు ఉన్నారు.

19 రోజూ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం 19 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించుకోవడం దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా అన్నారు. మంగళవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరంలో పాల్గొని కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ఇంజనీరింగ్ కార్మికులు స్ట్రీట్ లైట్లు, వాటర్ వర్క్స్, టౌన్ ప్లానింగ్‌లలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, వేతనాలు పెంచుతామని, హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఉధృతం అవుతుంది అని హెచ్చరించారు. నిరంతర ప్రజలకు సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికులకు ప్రజలందరూ కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు రాజా, సోము, ప్రసాద్ పాల్గొన్నారు.



నూతన పైపు లైను ఏర్పాటు

వార్తకు స్పందన



పగిలిపోయిన పైపు స్థానంలో నూతన పైప్ బిగించిన దృశ్యం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ గన్నావారిపల్లె గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించే సురక్షిత మంచినీటి పథకం పైప్ లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృధా అవ్వడమే కాక ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతుండటం గురించి ప్రజాశక్తిలో ఈనెల 1వ తేదీ వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి మజాహర్ పైప్‌లైన్ లీకేజీ ప్రదేశాన్ని పరిశీలించి జెసిబితో గుంత తవ్వి పగిలిపోయిన పైపును తొలగించి నూతన పైపులను బిగించారు. అనంతరం తాగునీరు పైపులలో పంపింగ్ చేసి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. అందరికీ తాగునీరు అందడంతో ప్రజలు ప్రజాశక్తికి పంచాయతీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఫయాజ్, నరహరి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛను రూ.1000లు పెంచి ఇవ్వడంతో లబ్ధిదారుల ముఖంలో సంతోషం కూటమి ప్రభుత్వంపై సంతృప్తి కనిపిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి చిత్తూరు నగరపాలక సంస్థ, కొంగారెడ్డిపల్లి వార్డు పరిధిలో పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌ను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తును అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎంపీ, ఎమ్మెల్యేలు వివరించారు. చిత్తూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సీఆర్ రాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, చిత్తూరు నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఎన్టీఆర్ పెన్షన్ ఆసరా అని సర్పంచ్ ఉషశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని తుంబపాల్యం పంచాయతీలో సామాజిక పింఛన్ పంపిణీ ఆరోగ్య కార్యకర్త నిర్మల ఆధ్వర్యంలో జరిగింది.

తోతాపురి ముంచింది.. టేబుల్ మామిడి ఆదుకుంది..

రైతుకు ఊరటనిస్తున్న ధరలు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):

జిల్లాలో తోతాపూరి రకం మామిడి ధరలు పాతాళానికి పడిపోయాయి. తోతాపురి మామిడి తోటల రైతులను నిండా ముంచాయి. రైతుల కన్నీటి దారాలను టేబుల్ రకాల మామిడి బేనీషా, మల్లిక, రుమాని, మల్‌గుబ, నీలం, కాలా పడి వంటి మామిడి ధరలు కాస్త ఊరటనిస్తున్నాయి. సీజన్ ముగింపు కావడంతో ధరలు సూచికలు ఒకింత మార్పులు కనిపిస్తున్నాయి.

చిత్తూరు జిల్లాలో సుమారు 1,39,000 ఎకరాల్లో సుమారు 57,000 హెక్టార్లలో మామిడి సాగు అవుతుంది. తోతాపురి రకం మామిడిని అధికంగా సుమారు 39,990 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇది మొత్తం మామిడి సాగులో 90శాతం వరకు ఉంటుంది.

జిల్లాలోని బంగారుపాళ్యం, దామలచెరువు, చిత్తూరు కేంద్రాల్లోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉన్న మామిడి మార్కెట్లలో టేబుల్ రకాల మామిడి ధరలకు కాస్త రెక్కలు వచ్చాయి. ఇది కాస్త ఉపశమనం కలిగించేదని రైతులు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాలోని కొన్ని మామిడి గుజ్జు పరిశ్రమలు రెండేళ్లుగా తోతాపూరితో పాటు టేబుల్ రకాలు బెనిషా, నీలం మామిడి కాయలు కూడా ప్రాసెసింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ఈ ప్రయోగం కలిస్తే రానున్న కాలంలో రైతులకు ధరలు పంట పండుతుంది. చిత్తూరు జిల్లా మామిడి దిగుబడిలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉంది. అందులో గుజ్జు తీయడానికి ఉపయోగపడే తోతాపూరీ రకం మామిడి తోటలు అత్యధికంగా సాగు చేస్తున్నారు.

జిల్లాలోని పూతలపట్టు నియోజవర్గంలో దాదాపు 50వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అందులో తోతాపురి రకానికి చెందిన మామిడి తోటల్లో అత్యధికంగా ఉంటే మిగతావి టేబుల్ రకాల తోటలు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా తవణంపల్లి వద్ద ఐదు మామిడి గుజ్జు పరిశ్రమలు, బంగారుపాళ్యం వద్ద రెండు పరిశ్రమలుంటే అందులో ఒకటి మాత్రమే పనిచేస్తుంది. గుడిపాలలో మండలంలో ఐదు జ్యూస్ పరిశ్రమలు ఉన్నాయి. బంగారుపాలెం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మామిడి గుజ్జు పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తుంది. అక్కడ సగటున రోజుకి 100 నుంచి 150 టన్నుల మామిడికాయలు వస్తున్నాయి. ఈ మార్కెట్లో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడుతో పాటు దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలకు కూడా మామిడిని తరలిస్తున్నారు.



తోతాపురికి ధర రాకపోవడంతో రోడ్డు పక్కనే పారబోస్తున్న రైతు



పొరుగు రాష్ట్రాల్లో టేబుల్ రకానికి భలే గిరాకీ..

టేబుల్ రకాల మామిడికాయలను పొరుగు రాష్ట్రాల వ్యాపారులు ఏడాది ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బేనిషా, మల్లుబా, నీలంతో పాటు అనేక రకాల మామిడి కాయల ధరలు ఇప్పుడు మెరుగ్గానే ఉన్నాయి. రిటైల్ మార్కెట్లో బేనిషాకు గత నెల చివరి వరకు కిలో రూ.80 నుంచి ఇప్పుడు 120ల వరకు ధర పలికింగి. అలాగే మల్లుబా రకం రూ.100 నుంచి నుంచి 120ల వరకు, హిమాంప సందు రూ.150 నుంచి 200లు, ఖాదర్ రూ.50 నుంచి 70లు, రుమాని రూ.45 నుంచి 60లు, నీలం రకం మామిడి కిలో రూ.30 నుంచి 40ల వరకు ధర పలుకుతుంది.

తోతాపురం రకం మామిడికాయలతో నష్టపోయిన రైతులకు టేబుల్ రకం ధరలు కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి.

టేబుల్ రకం మామిడితో రైతులకు లాభాలు....

ఈ సంవత్సరం బేనిషా, మల్లిక, రుమాని, మల్లుబా, అల్ఫోన్సో, నీలం, కలబడి వంటి ఇతర రకాల మామిడి దిగుబడి గణనీయంగా పెరిగింది. జిల్లాలో ఐదు లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. కృష్ణాజిల్లా తర్వాత చిత్తూరు జిల్లాలో దిగుబడి 8లక్షల టన్నులకు చేరిందని, వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారుల అంచనా వేసిన దాని ప్రకారం 2025లో 4,9,275 మెట్రిక్ టన్నుల కాయలు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది దిగుబడి పెరిగినప్పటికీ ధరల తగ్గడం వల్ల రైతులకు కష్టాలు తప్పలేదు.

రెండేళ్లుగా పేరుకుపోయిన గుజ్జు నిల్వలు

జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమలు 47 వరకు ఉంటే ఈ సీజన్ ప్రారంభంలో 33 పరిశ్రమలు మాత్రమే తెరిచారు. గత రెండేళ్లలో మిగిలిపోయిన గుజ్జు నిల్వలు ఉన్నా కొన్ని పరిశ్రమలు సామర్థ్యానికి తగినట్టు కొనుగోలు, ప్రాసెసింగ్ చేయడం లేదు. పనిచేసే పరిశ్రమలు కూడా ఓకే కన్వీర్ బెల్ట్, ఒకటి లేదా రెండు బెల్టులపై మామిడి గుజ్జు తయారీకి ప్రాసెస్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా టేబుల్ రకాలైన బేనిషా, రుమాని, నీలం వంటి కాయల గుజ్జు తీయడానికి కొన్ని పరిశ్రమలు ఆర్ అండ్ డి పద్ధతిలో ప్రయోగాత్మక పరిశీలన చేపట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఈ గుజ్జుకు ఆదరణ లభిస్తే రైతన్నలకు రానున్న కాలంలో మేలు జరిగే అవకాశం ఉంది.

ప్రజలకు అందని సచివాలయ సేవలు

- నామమాత్రపు మెమోలు
- మారని సిబ్బంది తీరు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

సచివాలయ పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పనితీరు నానాటికి అధ్వానంగా మారింది. కార్యాలయంలో ఉంటూ ప్రజలకు సేవ చేయవలసిన పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

నగిరి రూరల్ మండలంలో 13 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ సిబ్బంది పని ముగించుకుని 11 గంటలకే కార్యాలయం మూతవేసి ఇంటికి వెళ్లిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఒకటవ తేదీ పింఛన్ అందించిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కార్యాలయానికి రాకుండా ఇంటికి వెళ్లిపోయారు. దీంతో ఉదయం నుంచి కార్యాలయం మూతపడి ఉంది. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన స్థానిక ప్రజలు గంటల తరబడి వేచి ఉండి అక్కడి నుంచి వెనుదిరిగారు. సోమవారం ఎలాంటి సెలవు దినం కాదు అయినా కార్యాలయం ఎందుకు మూతవేశారో తెలియడం లేదని గుసగుసలాడుకున్నారు. ప్రతినెలా పింఛన్ పంపిణీ సాకుతో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది కార్యాలయానికి రాకుండా గంటలో పని ముగించుకుని ఇంటికి వెళ్ళిపోతున్నారని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

నామమాత్రంగా మెమోలు..

గత నెల యోగా డే సందర్భంగా కూడా సచివాలయ సిబ్బంది ఉదయం ఒక గంటసేపు యోగా చేసి ఆ తర్వాత కార్యాలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారన్న విషయం తెలుసుకున్న మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బందికి మెమోలాఉ అందించడం జరిగింది. అయినప్పటికీ అధికారుల తీరు మాత్రం మారకపోవడం శోచనీయం. ఉన్నతాధికారులు మెమోలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప వారి పనితీరులో మార్పు తీసుకుని రాలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవచేసే చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎం.కొత్తూరు సచివాలయం, తాళం వేసి ఉన్న నంబాకం గ్రామ సచివాలయం

సచివాలయంలో అందని సేవలు..

ప్రజలు ఎప్పుడొచ్చినా కంప్యూటర్ పనిచేయలేదు, సర్వేలో ఉన్నారని ఇలా సాకులు చెబుతున్నారు తప్ప పలు పనుల నిమిత్తం సచివాలయంకు వస్తున్న ప్రజలకు మాత్రం సేవలు అందించడం లేదు. స్కూల్స్, కాలేజీల ప్రారంభం కావడంతో పలువురు విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం సచివాలయం చుట్టూ తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంపై పలుమార్లు మండలస్థాయి అధికారులకు మొరపెట్టుకున్న సచివాలయ సిబ్బంది పనితీరు మాత్రం మారలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

బయోమెట్రిక్ లేదు...

సచివాలయం సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సచివాలయంలో విధుల్లో తప్పక ఉండాలి. అదేవిధంగా ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ కచ్చితంగా వేయాల్సిన అవసరం ఉంది అయినా సచివాలయం సిబ్బంది ఉదయం పూట మాత్రమే పెడుతున్నారు. సాయంత్రం బయోమెట్రిక్ పెట్టడం లేదు. మండల స్థాయి అధికారులకు తెలిసిన తెలిసి తెలియనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉపాధ్యాయ వృత్తికి ఉద్యోగ విమరణ ఉండదు

అపోలో యూనిర్శిటీ వీసీ డాక్టర్ వినోద్ భట్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయవృత్తికి ఉద్యోగ విరమణ ఉండదని, వయస్సు రిత్యా పదవీ విరమణ పొందినా నిరంతర బోధకులుగా, అనితర సాధకులుగా పనిచేస్తూ ఉంటారని చిత్తూరు అపోలో యూనిర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్ భట్ అన్నారు. అపోలో యూనిర్శిటీలో సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన అధ్యాపకులు డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ వేలాదిరెడ్డి, డాక్టర్ పెంచలయ్యలను సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మెడికల్ టీచర్లకు రిటైర్‌మెంట్‌తో పనిలేదని, వారి శరీరంలో శక్తి ఉన్నంత వరకు వృత్తిలో కొనసాగుతూ.. ప్రజలకు తమ సేమలు అందిస్తున్నారని చెప్పారు. 92 ఏళ్ళ వయసులో కూడా మెడికల్ వృత్తిని ఫ్యాషన్‌గా కొనసాగిస్తున్నవారు ఉన్నారని చెప్పారు. పదవీ విరమణ పొందిన వారు తమ సేవలను కొనసాగించాలని కోరారు. మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె అగస్టిన్, సీవోవో నరేష్ కుమార్ రెడ్డి, జీఎం డాక్టర్ వినోద్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్, అసోసియేషన్ డీన్ డాక్టర్ ఉషా సచ్చిదానంద, హ్యూమన్ రిసోర్సెస్ డిజీఎం డాక్టర్ కె.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏడాది సుపరిపాలనను ఇంటింటికి వెళ్లి వివరిద్దాం: ఎంపీ, ఎమ్మెల్యే పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అందించిన సుపరిపాలనను ఇంటింటికి వెళ్లి వివరిద్దామని.. సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన చిత్తూరు నియోజకవర్గం టిడిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించగా.. పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సీఆర్ రాజన్, నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్, రాంప్రసాద్ రెడ్డి, శ్రీధర్ వర్మ, గిరి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏ ప్రభుత్వం చేయలేని పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చేపట్టడం శుభపరిణామం అన్నారు. బుధవారం నుంచి చేపట్టనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, వి.సురేంద్రకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి, ఎమ్మెల్యే

బడికెళ్లలేకపోతున్నాం..!

- అపరిష్కృతంగా హైవే సమస్య
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- పరిష్కరించాలని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి - రొంపిచర్ల : ముందు చూపు కొరవడిన జాతీయ రహదారుల అధికారుల నిర్లక్ష్యంతో 60 మంది విద్యార్థులు బడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోలేదని దీంతో వారు మంగళ వారం బడి పిల్లలను స్కూలుకు పంపడం మానివేసి సమస్యను పరిష్కరించాలని తహశీల్దారును ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు సమస్యలను ఏకరువు పెట్టారు.

బడికెళ్లలేకపోతున్నాం..!

పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలం బండకిందపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వుంది. ఇక్కడ ఒకటి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులు 60 మంది చదువుకుంటున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పాత పాఠశాల భవనం కూల్చి వేశారు. అటు తరువాత విద్యార్థుల సౌకర్యార్థం నూతన ప్రభుత్వ పాఠశాల భవనం ఏర్పాటు చేశారు. నూతన పాఠశాల భవనం ఏర్పడడం ఓవైపు గ్రామస్తులకు, విద్యార్థులకు ఆనందాన్ని ఇచ్చింది. అయితే ఆ సంతోషం ఎంతోకాలం నిలువలేదు.

హైవే సమస్య

పాఠశాలకు వెళ్లాలంటే జాతీయ రహదారిని దాటుకుని వెళ్లాల్సి వుంది. జాతీయ రహదారి పనులు ముమ్మరంగా పూర్తయ్యే దశకు చేరుకుంది. ఇంతకాలం రోడ్డుకు ఇటు వైపు నుండి దాటుకుని అటు వైపు వున్న పాఠశాలకు చిన్నారులు వెళ్లేవారు. ఈ సందర్భంలో ప్రమాదా ల బారిన పడిన సంఘటనలు తల్లిదండ్రులను కలచి వేశాయి. ఈ క్రమంలో రహదారి పనులు చివరి దశకు చేరుకోవడంతో చిన్నారులు జాతీయ దారిని దాటుకుని వెళ్లాలంటే భయాందోళనకు గురవు తున్నారు. ఇంతవరకు గ్రామానికి అండర్ పాస్ దారిని కల్పిస్తా మని తెలిపిన జాతీయ రహదారి పర్యవేక్షణ అధికారులు ఇప్పుడు మాట మార్చి ఇక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయ డానికి వీలుకాదని తేల్చారు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

రహదారి పర్యవేక్షణ అధికారుల తీరుతో ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా స్థానిక అధికార యంత్రాంగం సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపలేదని ఆవేదన చెందుతున్నారు. ఇక చేసేది లేక తమ పిల్లలను ప్రభుత్వ బడికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పంపాల్సి వస్తోందని ఇది ఏమాత్రం వీలు కాదని చదువుకన్నా బిడ్డల ప్రాణాలే ముఖ్యమని మూకుమ్మడిగా మంగళవారం పాఠశాలకు తమ పిల్లలను పంపడం మానివేశారు. సురక్షితమైన దారి చూపేవరకు తమ బిడ్డలను పాఠశాలకు పంపమని మీడియా ముందు తెలిపారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు సూతం దారి సమస్య వాస్తవమేనని చిన్నపిల్లలు జాతీయ రహదారి దాటుకుని వచ్చి వెళ్లే పరిస్థితుల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తాము కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. రొంపిచర్ల ఎంఈఓ డి శ్రీనివాసులు పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపడం లేదు. గతంలో గ్రామస్తులు తహశీల్దారుకు, మండల విద్యాధి కారికి అర్జీలు సమర్పించి తమ గోడును తెలుపు కున్నా మన్నారు. రొంపిచర్ల మండల తహశీల్దారు స్పందించి పాఠశా లను సందర్శించారు. సమస్యను గుర్తించి వెంటనే హైవే అధికారులకు సమస్యల్ని తెలిపి విద్యార్థులకు దారి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హైవే అధికారు లను కోరారు.

హైవే అధికారుల వివరణ


సమస్యను అధికారులతో చర్చిస్తున్న దృశ్యం

హైవేకు సంబంధించిన అధికారి విజయకుమార్ గ్రామస్తులు కోరిన విధంగా దారి సౌకర్యం కల్పించడానికి నేషనల్ హైవే ఢిల్లీ నుండి పర్మిషన్ రావాలని, ఇప్పుడు తాము ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. తహశీల్దారు అమరనాథ్ స్పందించి తాత్కాలికంగా రహదారి నుంచి స్కూలుకు వెళ్లడానికి విద్యార్థులకు సౌకర్యం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సురేంద్ర, బండ కింద పల్లి గ్రామ సర్పంచ్ ఆన్సర్ బాష, నాయకులు కోటేశ్వర్ రెడ్డి, డీకే రామిరెడ్డి, బారేషా, ముక్తియార్, లాల్ బాషా, విద్య కమిటీ చైర్మన్ అస్మా సలీమ్, నౌషాద్, ప్రధానోపాధ్యా యులు జయంత్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

హత్య కేసులో మరో ఇద్దరికి రిమాండు

ప్రజాశక్తి- విజయపురం: స్థానిక మండలంలోని పాతార్కాడు సమీపంలో ఇళ్ళత్తూరు మార్గంలో జూన్ 23న తమిళనాడు అరుబాంక్కం గ్రామానికి చెందిన వెంకటేశ్వరన్(57) హత్యకు గురి అయ్యాడు. ఈ హత్య కేసుకు సంబంధించి పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు వెంకటేశన్ కుమారులు ప్రభు (38), సేతుపతి(34) లను అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించామని సీఐ భాస్కర్ తెలిపారు. ఈ కేసులో నేరం చేయ డానికి ఉపయోగించిన ట్రాక్టరును, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసు ఛేదించడంలో సహకరించిన ఎస్ఐ రంగా, ఏఎస్ఐ గోవిందరాజులు, సిబ్బంది దామోధరం, నరేష్, ఏళుమళై, మణివాలన్, గోపి, అయ్యప్పలను సీఐ అభినం దించారు.

14 మందికి జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 14 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టగా జడ్జి కుమారి ఉమా దేవి వాహనదారులకు 14 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 1,40,000 వేల రూపాయలు జరిమానా విధించారు. 1 సంవత్సరం ఏడు నెలల వ్యవధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 1625 మందికి సుమారు 1 కోటి 62 లక్షల 50 వేల రూపాయల జరిమానా విధించారు.

ముళ్ల కమ్మి ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం


అగ్ని ప్రమాదం సంభవించిన ముళ్లకంచె ఫ్యాక్టరీ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజక వర్గం వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లిలో ఫెన్సింగ్ కమ్మి తయారు చేసే ఫ్యాక్టరీలో మంగళవారం హఠాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ మేరకు యజమాని ఇందుమతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రమాద వశాత్తు జరిగిందా? లేక ఎవరైనా ప్రమాదం తల పెట్టారా? అని తేలాల్సి వుంది. ఈ ప్రమాదం కారణంగా లక్షల్లో ఆస్తి నష్టం ఉంటుందని యజమాని పేర్కొంటు న్నారు. ఫ్యాక్టరీ బయట ఆపి వుంచిన టాటా ఏస్ వాహనం, ఇతర సామగ్రి పాక్షికంగా కాలిపోయాయని యజమాని వాపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతుండడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, రైతులు ఒకే సారి స్కూలు, కాలేజ్ బస్సులు, ఆటోలు, లారీలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపైకి రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలమనేరు పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా మారుతున్నా కాలానికి తగినట్లు రోడ్ల విస్తీర్ణం పెరగలేదు. దీనికి తోడు విపరీతంగా వవాహనాలు రావడంతో ప్రయాణికులు సిటీలో మాదిరి ట్రాఫిక్ జామ్ పద్మవ్యూహంలో ఇరుక్కుని ముందుకు వెనక్కు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు ఇదే సమస్య తలత్తుతోంది. సంబంధించిన అధికారులు ఈ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తం

ఇండియన్ బ్యాంక్ వద్ద వాహన చోదకులకు ఇబ్బందులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లిలోని పలమనేరు-కుప్పం జాతీయ రహదారి సమీపంలోని ఇండియన్ బ్యాంకువద్ద వాహనాలను ఇష్టాను సారం అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల పలమ నేరు - కుప్పం జాతీయ రహదారిపై వాహనా లు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారి దృష్టిలో పెట్టుకొని ప్రయాణి కులకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు చర్యలు చేపట్టాలని లేదంటే బ్యాంక్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిలోనే క్రాస్ రోడ్ ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం వుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో జాతీయ రహదారిలో, శనివారం పుంగనూరు రోడ్‌లోని వారపు సంత, మండలం లోని జాతీయ రహదారిలో వాహన దారులకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


టిటిడి చైర్మన్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా టిటిడి చైర్మన్ జన్మదినం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలం కేంద్రంలో టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు 74వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నేతలు ప్రసాద్ నాయుడు, మురళి నాయుడు, నరసింహులు నాయుడు, చంద్ర గౌడ్, మధు నాయుడు, ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, రఘు నాయుడు, హరీష్ యాదవ్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ముస్లిం మైనార్టీ, వైసిపి యువజన నాయకుడు తాకీరాఖాన్

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి -కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ముస్లిం మైనారిటీ వైసిపి యువ నాయకుడు తాకీరాఖాన్ మంగళవారం తన జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వమించారు. వృద్ధాశ్రమంలో భారీ కేక్ కట్‌చేసి పళ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ కార్వేటి నగరం సర్పంచ్ ధనంజయవర్మ మాట్లాడుతూ తాకీరాఖాన్ అతి చిన్న వయస్సులోనే దానగుణాలు కలిగి తన తాత సుభాన్సాన్ అడుగు జాడలో నడుస్తున్నాడని గుర్తు చేశారు. అలాంటి తౌకీరాఖాన్ రాజకీయ రంగంలోనూ అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ తాకీరాఖాన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఆయనకు నాయకులు పుష్పగుచ్చాలు సమర్పించి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, వైఎస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు పట్నం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధానకార్యదర్శి చందురాజు, మణిరెడ్డి, దాము రెడ్డి, రఫీ, అమితుల్లా, యశ్వంత్లాఖాన్. సర్దార్, సిరాజ్, ధనశేఖర్ యాదవ్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యదర్శి జన్మదిన వేడుకలు

చిత్తూరు అర్బన్: టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ నాయకులు చెన్నకేశవ నాయుడు, పలువురు టిడిపి నాయకులు , కార్యకర్తలు మోహన్ రాజుకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి మోహన్ రాజ్ కి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. తగిన జాగ్రలు పాటించాలన్నారు.

భిక్షాటన పదం తొలగింపుపై హర్షం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: దాసరుల కుల ధృవీకరణ పత్రంలో భిక్షాటన అనే పదం తొలగించడం స్వాగతించాల్సిన విషయమని దాసరి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి రవి అన్నారు. చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో జారీ చేసిన కుల ధృవీకరణ పత్రంలో దాసరులకు భిక్షాటన అనే పదాన్ని చేర్చే వారని తెలిపారు. భిక్షాటన అనే పదం తమ మనో భావాలనులను దెబ్బతీసే విధంగా ఉందని, దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఆ పదాలను తొలగించేలా చర్యలు చేపట్టడం హర్షణీయ మన్నారు. ఈ సమావేశంలో దాసరి రిజర్వేషన్ పోరాట సమితి నాయకు లు వెంకటరమణ, సుబ్బయ్య, జయచంద్ర, శేఖర్, మధు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక ప్రతిభావంతులకు పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం : ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధులు గత డిసెంబరు 18వ తేదీ నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 195 మంది పరికరాలకు ఎంపికయ్యారని వారికి ఈ నెల 3వ తేదీ కేంద్రం మంత్రి చేతుల మీదుగా పరికరాలు అందిస్తామని ఎంపిడివో మోహన మురళి మంగళవారం పేర్కొన్నారు. ఎంపికైన 195 మంది, వికలాంగులకు, వృద్ధులకు చేతి కర్రలు వాకర్లు, చంక కర్రలు, వీలు చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్ మూడు చక్రాల సైకిల్, కుష్టు వ్యాధిగ్రస్తులకు లెప్రసి కిట్లు అందిస్తామన్నారు.



చెత్త సేకరణ పనులు తనిఖీ చేస్తున్న ఎంపిడివో

చెత్త సేకరణ తనిఖీ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలోని సంతబైలు పంచాయతీలో ఇంటింటికీ చెత్త సేకరణ పనులను ఎంపిడివో పురుషోత్తం మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ మండలం లోని కొన్ని పంచాయతీలను ఐవిఆర్ఎస్ పంచాయతీలుగా ఎంపిక చేసి వాటి పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటికీ చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్నామన్నారు. పారిశుధ్యం, ఇంటింటికీ చెత్త సేకరణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల దగ్గర పారిశుధ్య నిర్వహణ, చాలా రోజులుగా పట్టించుకోకుండా వదిలేసిన పాత వ్యర్థాలను తొలగించడం వంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: ప్రజలు నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఈవోఆర్‌డి లక్ష్మీదేవి కోరారు. మండల కేంద్రం సోమలలో ఇంటింటికి చెత్త సేకరణను ఆమె పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం వేయకూడదని చెత్త తరలింపు వాహనం వచ్చినప్పుడు ప్రజలు తడి పొడి చెత్త వేరు చేసి చెత్త వాహనంలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ షకుకూర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ షకూర్ మాట్లాడుతూ కల్లూరు గ్రామపంచాయతీ పరిశు భ్రత, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి కల్లూరు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి చెత్త కేంద్రంలో వేసి ఎరువును తయారు చేస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న యుటిఎఫ్ జిల్లా నాయకురాలు సరిత

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విమరణ తప్పదు: యుటిఎఫ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని యుటిఎఫ్ జిల్లా నాయకురాలు సరిత అన్నారు . సోమవారం రాత్రి మండ లంలోని మాజీ యుటిఎఫ్ సభ్యులు సురేంద్రనాయుడు స్వగృహంలో విజయ్ కుమారి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ఉద్యోగికి చేరినప్పుడే ఉద్యోగ విరమణ తేదీ ఖరారు అవుతుందన్నారు. అనంతరం దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయులు పార్థసారథి, యుటిఎఫ్ మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు సుమతి, లలిత, మల్లీశ్వరి, సిఆర్‌పి సుశీల , పలువురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అమరేంద్ర కుమార్


ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రం సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అమరేంద్రకుమార్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహిం చిన బదిలీలలో సోమల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న గంగాధర నాయుడు పుంగనూరు జూనియర్ కళాశాలకు, గుర్రంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అమరేంద్ర కుమార్ సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్‌కు కళాశాల అధ్యాపకులు పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికా రు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యులకు ఘన సన్మానం

గంగవరం: గంగవరం ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల ప్రధాన వైద్యులు డాక్టర్ జె శ్రీనివాసులు, వైద్యులు డాక్టర్ లహరిలను గంగవరం వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు . ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణ చైతన్యను మండల ఆర్ఎంపీలు సన్మానించారు. మంగళవారం మండల పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిరంజీవి రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మధు, మురళి, ఆర్ఎంపి సభ్యులు పాల్గొన్నారు.


సోమలలో

సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని ఐబి గ్రూప్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రం చిత్తూరు వారి సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని వడ్డిపల్లి సమీపంలోని కోళ్ల ఫారంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది స్వచ్ఛందంగా యువతీ యువకులు రక్తదానం చేశారు. పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాలాజీ, సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి సిహెచ్ఓ అమరనాథ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్ర మంలో దినేష్, రామకృష్ణ మనోజ్ ఐబి గ్రూప్ సిబ్బంది పాల్గొన్నారు.



పలమనేరులో

పలమనేరు: పలమనేరులో డాక్టర్స్ డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షర వికలాంగుల పాఠశాల , జీవదాత వృద్ధాశ్రమం రంగస్థలంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు, అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యుగంధర్, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, వారి బృందం , శ్రీపురం సీతారామయ్య పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం లోని పీఈఎస్ వైద్య కళాశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టరు హెచ్.ఆర్. కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు వివిఎస్ఆర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు సుబ్రహ్మణ్యంకె మాట్లాడుతూ తమ విద్యా సంస్థ ప్రారంభం నుండి 2,665 ఎంబిబిఎస్ విద్యార్థులు, 894 పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్పెషలిస్టులు విజయవంతంగా తమ విద్యను పూర్తి చేసుకొని, పట్టభద్రులు అయ్యారని తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం బొమ్మయ్య గారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 సంవత్సరాలుగా విద్యను బోధిస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయురాలును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రధానోపాధ్యా యుడు చిన్నయ్య మాట్లాడుతూ బదిలీ ఉపాధ్యాయులు పాఠశాలకు చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, ఉపాధ్యాయులు చిన్న రెడ్డప్ప నాయుడు, రమేష్, వెంకటనారాయణ, రంగారెడ్డి లు పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఉపాధ్యాయులు ఆఫీజుల్లా, కళ్యాణి, జాఫర్, గుర్రప్ప, సుబాకర్, స్వర్ణలత, సంపూర్ణ, ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిల ఎన్నిక

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి మండలంలో 18 పంచాయతీలకు సంబంధించి క్లస్టర్ ఇన్‌ఛార్జిలను మంగళ వారం ఎన్నుకున్నారు. మండలంలోని 18 పంచాయతీలకు ఎనిమిది పంచాయతీల పరిధిలో క్లస్టర్ ఇన్‌ఛార్జిగా మాజీ జెడ్‌పిటిసి బేటప్ప నాయుడు, 10 గ్రామ పంచాయతీలకు సంబంధించి క్లస్టర్ ఇన్‌ఛార్జిగా బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని 18 పంచాయతీలను రెండు క్లస్టర్ గా విభజించి పార్టీ బలోపేతానికి వీలుగా ఏర్పాటు చేశామన ఆ పార్టీ నాయకులు తెలిపా రు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మాట్లాడుతూ పార్టీ తమపై ఎంతో నమ్మకంగా ఈ పదవులను అప్ప గించ డంతో పార్టీకి విధేయతతో పనిచేస్తామని పార్టీ బలో పేతానికి తమ వంతు కృషి చేస్తా మని, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, రాష్ట్ర ఏపీ ఎస్ ఆర్ టి సి వైస్ చైర్మన్ మునిరత్నంకి, మండలంలోని మండల నాయకులకి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుం టున్నామని వారు తెలిపారు.


ఐదవ క్లస్టర్ ఇన్‌ఛార్జి బాలాజి


ఆరవ క్లస్టర్ ఇన్‌ఛార్జి బేటప్పనాయుడు

సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి -శాంతిపురం : శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ చీమనపల్లి గ్రామం నందు మెయిన్ రోడ్ నుండి ఎస్సీ కాలనీ వరకు 1090 మీటర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో చేపట్టిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పిఎస్ మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు పంచాయతీ పార్టీ పెద్దల సహకారంతో 70 లక్షల తో సిసి రోడ్ పనులను మంగళవారం పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, తూర్పు రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్, కడ అభివృద్ధి కమిటీ రాజకీయ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, చంద్రశేఖర్, గిరిధర్, రుద్రప్ప, పలువురు కర్లగట్ట పంచాయతీ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండ: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పూతలపట్టు: పేదలకు టిడిపి అండగా ఉంటుందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లోకనాథ్ గుప్తాకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.1,46,250 చెక్కును ఆయనతో పాటు స్థానిక నాయకులు గుంటూరు మురళి నాయుడు, చంద్రమౌళి అందించారు. మెదడు వాపు వ్యాధితో బాధపడుతున్న బాధితుడిని ఆదుకోవడానికి ఈ సహాయం చేశామన్నారు.

కుప్పం టౌన్ : రాజకీయ నాయకులు రాగద్వేషాలకు అతీతంగా ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం సూచించారు. మంగళవారం నాడు కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులతోపాటు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కడ సలహా మండలి సభ్యులు డాక్టర్ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఎస్ఆర్ పురం : రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకు లు గంధమనేని రాజశేఖర్ నాయుడు,భాస్కర్ నాయుడు, చోక్కమడుగు కుమార్,మోహన్ నాయుడు, సూరి రెడ్డి, బాలాజీ నాయుడు, ఢిల్లీ ,నిరంజన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరు: సంవత్సరం కాలంలో టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి , సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, హరీష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి, నాయకులు కోదండ రెడ్డి, మునిరాజు యాదవ్, జ్యోతి యాదవ్, బాబు నాయుడు, శివప్రసాద్, శాంత కుమార్, శేఖర్, గోపి, సంపత్, ప్రకాష్ పాల్గొన్నారు.

రాళ్లు వేసి వదిలేశారు..

- ఎనిమిదేళ్లుగా దుస్థితి
- కంకరపైనే ప్రయాణం
- చినుకు పడితే దుర్లభం
- చీకటి పడకముందే గ్రామానికి చేరుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం గండ్రాజు పల్లి పంచాయతీ మర్రిమాకులపల్లి గ్రామం రోడ్డును కంకర రాళ్ళ వేసి వదిలేశారు..ఎనిమిదేళ్ళ అవుతున్నా అభివృద్ధి లేదు..దీంతో ఆ గ్రామస్తులు కంకరపైనే ప్రయాణిస్తూ పడరాన్ని పాట్లు పడుతున్నారు. చినుకు పడితే ఇక వారి అవస్థలు వర్ణనాతీతం..ఏదైనా పనుల మీద పట్టణానికి వెళ్లిన వారు చీకటి పడకముందే ఆ గ్రామానికి చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది..అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించక పోవడంతో ఆ గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

రాళ్లు వేసి వదిలేశారు..

గంగవరం మండలం గండ్రాజు పల్లి పంచాయతీ మర్రిమాకులపల్లి గ్రామం చెన్నై- బెంగళూరు రహదారి నుండి రెండు కిలోమీటర్లు దూరంలో వుంది. ఎనిమిది సంవత్సరాల క్రితం రోడ్డు మరమ్మతుల కోసం కంకర తోలి వదిలి వేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. దీంతో ఆ కంకర మీదే ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా దుస్థితి

ఈ మార్గం ద్వారా ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. ఈ కంకర అక్కడక్కడా గుంతల మయమై కొద్దిపాటి వర్షానికి మడుగులా మారుతోంది. దీంతో ఎక్కడ దారి వుందో.. ఎక్కడ గుంతలు వున్నాయో తెలియని దుస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలో ఈ పనులు చేపట్టారని తర్వాత వైసిపి గెలవడంతో ఆ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో ఈ ఇబ్బందికర పరిస్థితి నెలకొంది.

కంకరపైనే ప్రయాణం

ఎక్కడైనా దూర ప్రాంతాలకు ఈ కంకర రోడ్డు మీదే వెళ్లాల్సి వస్తోందని, భయం గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందికరంగా వుందని స్థానికులు వాపోతున్నారు. గుంతలమయమైన రోడ్డు ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీకటి పడకముందే గ్రామానికి చేరుకోవాలి

మర్రిమాకులపల్లి రహదారిపై ద్విచక్ర వాహనాలు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యాయని గ్రామస్తులు తెలిపారు. ఈ మార్గం గుంతలమయమై వెళ్లడానికి వీలులేని పరిస్థితుల్లో వుందని, రెండు కిలోమీటర్లు కాలినడకనే వెళుతున్నామని పేర్కొం టు న్నారు. రైతులు పండించిన పంటలను, కళాశాలకు వెళ్లే విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో అతికష్టంమీద ప్రయాణిం చాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ రహదారి దుస్థితి కారణంగా కూరగాయలు పంటలు పండించడం



పూర్తిగా వదిలివేశామని మర్రిమాకులపల్లి గ్రామస్తులు వాపోతు న్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డును బాగుచేసి రహదారి సమస్య పరిష్కరిం చాలని గ్రామస్తులు కోరుతున్నారు.